# వారసత్వం

సుబ్బారావు కుటుంబంలో నాలుగు రోజులనుంచి కోల్డ్ వార్ జరుగుతోంది. ఆయన భార్యకి, ఆయనకీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వుంది పరిస్థితి.

నాలుగురోజులక్రితం తనభార్యమిగిలిపోయిన వంటమనిషికిస్తుండగా సుబ్బారావు చూసాడు. కష్టపడి సంపాదించే ఆయన వృధా చేయటం భరించలేడు. అంతకు మునుపు ఈ విషయం మీద భార్యాభర్తలిద్దరికీ లెక్కలేనన్ని సార్లు ఘర్షణ జరిగింది.

“ఇరవై ఒక్క సంవత్సరాలనుంచి నాతో కాపురం చేస్తున్నావు. కొన్ని లక్షలసార్లు చెప్పాను. ఎక్కువ ఎక్కువ వండి పనిమనుషులకి దానం చేయద్దని, నీకెప్పటికి బుద్ధొస్తుంది?” అరిచాడాయన.

“చిన్నాడు బయట తినొచ్చాడట పెద్దాడికి ఆకల్లేదట. నేనేం చేయను?” గయ్యిమంది ఆవిడ కూడా.

“ఆకల్లేదంటే మర్నాడు ఆ సద్దెన్నం వాళ్ళకే పెట్టాలి. వాళ్ళు ముందే చెప్పక్కర్లా?”

“అయినా తూచినట్టు వండటం ఏ ఆడదానికీ చేతకాదు. కొద్దో గొప్పో మిగలడం ఏ ఇంట్లో అయినా మామూలే.”

“యీ ఇంట్లో అలాంటి మామూళ్ళు నాకు గిట్టవు గాక గిట్టవు”

తుపాకి గుళ్ళలా మాటలని ఒకరిమీద మరొకరు ప్రయోగించుకున్నారు కాసేపు.

ఆ రాత్రి కూడా అనుకోకుండా అన్నం, పులుసు మిగిలాయి. వేసంకాలం మర్నాటి ఉదయం దాకా వుండదని వీధిలో అడుక్కునే బిచ్చ

గాడికి వేసిందామె. సరిగ్గా ఆ సమయంలోనే ఇంటికి వచ్చిన సుబ్బారావు కంటపడిందా దృశ్యం.

ఈసారి ఫిరంగి గుళ్ళలాంటి మాటలవి ఒకరిమీద మరొకరుప్రయోగించుకున్నారు ఆతర్వాత కోల్డ్‌వార్. అది మూడు రోజుల దాకాసాగింది. ఎంతో అవమానంగా ఫీల్ అవుతున్న సుబ్బారావు భార్య పెట్టే, బేడ సర్దుకుని ఆయనతో చెప్పింది.

"నేను మా పుట్టింటికి వెళుతున్నాను."

పేపర్‌లోంచి బయటికి చూడకుండానే ఆయన చెప్పాడు.

"రైలుకి టైమయినట్లుంది త్వరగా వెళ్లు."

"ఎందుకు వెళుతున్నావ్?" లాంటి ప్రశ్నలు వేసి మళ్ళీ చర్చ లేవదీసాడనుకుంది ఆవిడ, అలాంటిదేం లేకపోవడంతో ఆవిడ అహం దెబ్బతింది.

ఆవిడ వెళ్ళిన ఇరవై నిముషాలకి బయట రిక్షా ఆగింది. అందులోంచి దిగి, రిక్షా అతనికి చిల్లర ఇచ్చి చేతితో సూట్‌కేస్‌తో లోపలకు వచ్చింది ఇరవై ఏళ్ళ సుబ్బారావు ఏకైక కూతురు.

"ఏమ్మా! కులాసానా అల్లుడేడీ?" అడిగాడు సుబ్బారావు కూతుర్ని ఆప్యాయంగా.

"నేనొక్కదాన్నే వచ్చానండీ" చెప్పింది సుబ్బారావు కూతురు తల వంచుకుని.

ఆమె లోపలకి వెళ్ళి అయిదు నిమిషాల్లో బయటికి వచ్చి అడిగింది తండ్రిని.

"అమ్మేది?"

"మీ అమ్మమ్మ దగ్గరకు వెళ్ళింది" చెప్పాడు సుబ్బారావు.

అరగంటలో ఆమె తన కడుపులోని బాధనంతా తండ్రి ముందు కక్కింది.

తన భర్త తను చేసిన ప్రతీ వంటకాన్ని రుచి చూసి, వుప్పు తక్కువైందనో లేదా ఎక్కువైందనో సాధిస్తున్నాడని, "అప్పడాలు వేయించటం కూడా రాని వాజెమ్మ నా పెళ్ళాం" అన్నాడట క్రితం రాత్రి. ఇద్దరిమధ్యా వాగ్యుద్ధం జరిగింది. తెల్లారేదాకా ఆగి భర్తని ఆఫీసుకి పంపించి, తను పుట్టింటికి వెళుతున్నానని చీటీరాసి పెట్టి బస్సులో వచ్చేసింది.

"నన్ను కొట్టినా, తిట్టినా పడతాను కాని నా వంటకి అలా వంకలు పెట్టటం మాత్రం సహించను. ఆయనకి బుద్ధివచ్చాక వచ్చి నన్ను తీసు కెళ్ళేదాకా వెళ్ళనండి" చెప్పింది ఆమె సుబ్బారావుకి.

సాయంత్రం పోస్టులో ఓ వుత్తరం వచ్చింది. అది సుబ్బారావు అరవై ఏళ్ళ అత్తగారు తన కూతురికి రాసింది కూతురికి రాసినా, కవరు మీద సుబ్బారావు పేరు రాయడం ఆవిడకి అలవాటు కాబట్టి ఆయన కవరు చించి చదివాడు. తర్వాత చిన్నగా నిట్టూర్చాడు. ఆ వుత్తరం సారాంశం....

"ఇన్నేళ్లొచ్చినా మీ నాన్నకి ఇంకా బుద్ధిరాలేదు. పరాయివాళ్ళ ముందు నన్ను నోటికొచ్చిన మాటంటారు. డైనింగ్ టేబొల్ మీద వలికిన కాఫీని వెంటనే తుడవలేదని ఒకటే సణుగుడు. నేను మా తమ్ముడింటికి వెళుతున్నాను. మళ్ళీ ఆయనంతట ఆయన వచ్చి, తప్పయిపోయిందని చెప్పి తీసుకెళితేకాని వెళ్ళను. మా తమ్ముడి ఇంటికే వుత్తరాలు రాస్తూండు...."

# పల్లెటూరి భార్య

నాకున్న మంచి స్నేహితుల్లో రాహుల్ ఒకడు. మా ఆఫీసులోనే చేరిన వారం రోజుల్లోనే అతను నాకు మంచి మిత్రుడయ్యాడు.

నాకొచ్చే జీతంలో వివాహం చేసుకొని సుఖంగా బ్రతకగలనా అనే అనుమానం వుండడంతో ఇంటినించి వుత్తరాలొస్తున్నా ముందరే కుదిరిన